# 26 లేదా.. ఆ తరువాత ఎప్పుడైనా డిఎస్సీ ఫలితాలు!

2లో

తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT

ఎడిటర్: బక్క రవీందర్

ఆదివారం 18, ఆగస్టు 2024

**సమస్య ఏదైనా**

దాని వెనుక ఎవరున్నా...
నిజాన్ని నిర్భయంగా చూపిస్తాం
మీకు తెలిసిన ప్రజల సమస్యలు
మాకు తెలియజేయండి.
ఇండిపెండెంట్ జర్నలిజానికి
వేదిక.. మీ డైలీ రిపోర్ట్
ఫోన్ నెంబర్
8501919707



## క్షమాపణ చెప్పినప్పటికీ నోటీసులు వచ్చాయి... 24న మహిళా కమిషన్ ఎదుట హాజరవుతా: కేటీఆర్

- కాంగ్రెస్ హయాంలో మహిళలపై జరుగుతున్న దాడులను కమిషన్‌కు వివరిస్తానని వెల్లడి
- 8 నెలలుగా దాడులు, అత్యాచారాలు జరుగుతుంటే ఏం చర్యలు తీసుకున్నారో అడుగుతానన్న కేటీఆర్
- రేవంత్ రెడ్డి ప్రధాని మోదీతో టచ్‌లోకి వెళ్లారన్న కేటీఆర్



హైదరాబాద్: తెలంగాణ మహిళా కమిషన్ ఇచ్చిన నోటీసులు తనకు అందాయని, ఈ నెల 24న కమిషన్ ముందు హాజరవుతానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన

మిగతా 2లో

## కోల్‌కతా హత్యాచారం కేసు... 43 మంది డాక్టర్లపై బదిలీ వేటు

- హత్యాచారం కేసులో కఠిన చర్యలకు దిగిన బెంగాల్ ప్రభుత్వం
- నిరసనలో పాల్గొన్నందుకే బదిలీలు చేశారంటున్న యునైటెడ్ డాక్టర్స్ అసోసియేషన్
- విధుల్లో ఉన్న డాక్టర్లకు భద్రత కల్పించాలని డిమాండ్

2



## ఆగస్టు 15 లోగా రుణమాఫీ పూర్తి చేస్తామన్నారు.. ఎక్కడ చేశారు?: హరీశ్ రావు

- ఎన్నికల మేనిఫెస్టోలో 40 వేల కోట్లు మాఫీ చేస్తామన్నారు
- కేబినెట్ భేటీలో 31 వేల కోట్లకు తగ్గించారు
- బడ్జెట్ లోనేమో 26 వేల కోట్లు కేటాయించారని హరీశ్ రావు విమర్శ
- తీరా చేసిందేమో 17 వేల కోట్ల రూపాయలు మాత్రమేనని ఆరోపణ
- రైతు రుణమాఫీపై హరీశ్ రావు కీలక ప్రెస్ మీట్

2



- పల్స్ ఆఫ్ పీపుల్ సర్వే పాలన పట్ల 21 శాతం మంది ప్రజల అసంతృప్తి
- పాలనపై ఏమీ చెప్పలేమన్న 7 శాతం మంది
- రాష్ట్రవ్యాప్తంగా 9,665 శాంపిల్స్ సేకరణ
- రేవంత్ రెడ్డి పాలన పట్ల సర్వే ఫలితాలు... స్పందించిన కాంగ్రెస్ నేతలు
- కాంగ్రెస్ పాలనను ప్రజలు ఆమోదించారన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ
- తెలంగాణ ప్రజల్లో సానుకూల స్పందన కనిపిస్తోందన్న మధుయాష్కీ
- పరిమిత సమయంలో బాగానే పని చేశామన్న షబ్బీర్ అలీ

## రేవంత్ రెడ్డి ప్రభుత్వ పనితీరుపై

# 72 శాతం మంది ప్రజల సంతృప్తి

'పల్స్ ఆఫ్ పీపుల్ ఇన్ తెలంగాణ' పేరుతో నిర్వహించిన సర్వేలో 72 శాతం మంది కాంగ్రెస్ పాలన పట్ల సంతృప్తి వ్యక్తం చేయగా, 21 శాతం మంది అసంతృప్తిగా ఉన్నట్లు తెలిపారు. సర్వేలో పాల్గొన్న వారిలో 7 శాతం మంది ఏమీ చెప్పలేమని వెల్లడించారు.సర్వేలో పాల్గొన్న వారిలో 55 శాతం మంది రేవంత్ రెడ్డి పనితీరు చాలా అద్భుతంగా ఉందన్నారు. 7 శాతం మంది చాలా బాగుందన్నారు. 10 శాతం మంది బాగుందని చెప్పారు. ఎనిమిది శాతం మంది మాత్రం బాగాలేదని చెప్పగా, ఇరవై శాతం మంది ఏమీ చెప్పలేమన్నారు. అగ్ని న్యూస్ సర్వీస్ ప్రతినిధి ఆర్ సురేశ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఈ సర్వేను ఆగస్ట్ 1 నుంచి ఆగస్ట్ 10 మధ్య నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 9,665 శాంపిల్స్ తీసుకున్నారు. తెలంగాణలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఈ సర్వే నిర్వహించారు. ఉద్యోగులు, వ్యాపార వర్గాలు, శ్రామిక వర్గాలు, విద్యార్థులు, పురుషులు, మహిళలు పాల్గొన్నారు. ఎనిమిది నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరు అంచనాలకు మించిందని సురేశ్ కుమార్ తెలిపారు. రేవంత్ రెడ్డి రాణించగలరా? అనే భయాలు అన్ని వర్గాల్లో కనిపించాయని, కానీ సర్వే ఫలితాల్లో ప్రజలు సంతృప్తిగా ఉన్నట్లు తేలిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలన పట్ల 72 శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారంటూ ఓ సర్వే వెల్లడించింది. 'అగ్ని న్యూస్ సర్వీస్' ఆగస్ట్ 1 నుంచి ఆగస్ట్ 10 మధ్య సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో మెజార్టీ తెలంగాణ ప్రజలు రేవంత్ రెడ్డి పాలన పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సర్వేపై పలువురు కాంగ్రెస్ నేతలు స్పందించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ ఐఏఎన్ఎస్‌తో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి, మంత్రివర్గం పాలనను తెలంగాణ ప్రజలు ఆమోదించారన్నారు. హైదరాబాద్ అందరికీ చాలా ముఖ్యమైన నగరమని, దానిని ప్రపంచస్థాయి నగరంగా మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తామన్నారు.

తమ ప్రభుత్వంపై తెలంగాణ ప్రజల్లో సానుకూల స్పందన కనిపిస్తోందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తమ ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని అధిష్ఠానం కూడా చెబుతోందన్నారు. అభివృద్ధి, సంక్షేమం... రెండూ ముఖ్యమే అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడమే తమ ముందున్న కీలక అంశమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీ




మిగతా 2లో

హైదరాబాద్ : తెలంగాణలోని 72 శాతం మంది ప్రజలు రేవంత్ రెడ్డి ప్రభుత్వ పనితీరుపై సంతృప్తిగా ఉన్నారని 'పల్స్ ఆఫ్ పీపుల్' సర్వేలో వెల్లడైంది. ఈ సర్వేను తెలంగాణ కాంగ్రెస్ నేతలు స్వాగతించారు. తమ పార్టీ ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తోందని, తమ ప్రభుత్వం పని తీరుకు ఈ సర్వే నిదర్శనమని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.ఇటీవల 'అగ్ని న్యూస్ సర్వీస్' 8 నెలల కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరుపై సర్వేను నిర్వహించింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఈ ప్రభుత్వం అమలు చేస్తోందని సర్వేలో పాల్గొన్న ఎక్కువమంది ప్రజలు వెల్లడించారు. ఈ సర్వేపై తెలంగాణ కాంగ్రెస్ నేతలు 'ఐఏఎన్ఎస్'తో మాట్లాడుతూ... ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ క్రెడిట్ అంతా రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదే అన్నారు. ప్రభుత్వం తమ పార్టీ అగ్రనాయకత్వం మార్గదర్శకత్వంలో ముందుకు సాగుతోందన్నారు.

## విద్యుత్ బిల్లులు గతంలో వలె ఫోన్‌తో చెల్లించవచ్చు

- యుపిఐ పేమెంట్స్‌కు తొలగిన అడ్డంకులు
- గూగుల్‌పే, ఫోన్‌పేతో ఇంటిలో నుంచే చెల్లించే వీలు
- బిబిపిఎస్‌లో చేరిన విద్యుత్ సంస్థలు




హైదరాబాద్: విద్యుత్ బిల్లుల చెల్లింపులకు సంబంధించి వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలకు చెక్ పడనున్నది. గతంలో మాదిరిగా గూగుల్‌పే, ఫోన్‌పే, పేటిఎం తదితర యుపిఐ మార్గాల్లో చెల్లించేందుకు అడ్డంకులు తొలగిపోయాయి. త్వరలో పాత విధానంలోనే నెల నెలా బిల్లులు చెల్లించే వీలు కలుగుతుందని భారత్ బిల్‌పే లిమిటెడ్ (బిబిఎల్) సిఇఒ నుపూర్ చతుర్వేది సూచించారు. భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్ (బిబిపిఎస్) ద్వారా మాత్రమే చెల్లింపులు జరగాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) ఆదేశించిన విషయం విదితమే. దీనితో జూలై 1 నుంచి యుపిఐ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించడం కుదరడం లేదు. ఆర్‌బిఐ నిర్ణయం కారణంగా విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనితో తెలుగు రాష్ట్రాల విద్యుత్ సంస్థలు స్పందించాయి. బిల్లు చెల్లింపులను సులభతరం చేసేందుకు టిజిఎస్‌పిడిసిఎల్, టిజిఎన్‌పిడిసిఎల్‌తో పాటు ఆంధ్ర ప్రదేశ్‌లోని ఎపిసిపిడిసిఎల్ సంస్థలు భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్‌లో చేరాయి. ఫలితంగా యుపిఐలతో పాటు బ్యాంకులు, ఇతర ఫిన్‌టెక్ సంస్థల సాయంతో విద్యుత్ బిల్లు చెల్లించే అవకాశం వినియోగదారునికి కలుగుతుందని చతుర్వేది తెలియజేశారు. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న టిజిఎస్‌పిడిసిఎల్ ఇప్పటికే ఫోన్‌పే ద్వారా చెల్లింపులను స్వీకరిస్తోంది. త్వరలో గూగుల్‌పే, అమెజాన్‌పేతో కూడా చెల్లించవచ్చునని అధికారులు సూచించారు.

## తెలంగాణలోని పలు జిల్లాల్లో మరో ఐదు రోజుల పాటు వర్షాలు

- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ
- పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు
- గాలులు గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో వీయవచ్చునని వెల్లడి



హైదరాబాద్: తెలంగాణలోనిపలు జిల్లాల్లో రానున్న ఐదు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశము ందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈరోజు నుంచి రేపటి వరకు నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు

మిగతా 2లో

## మరోసారి పార్లమెంట్‌లో

# భద్రత వైఫల్యం

- పార్లమెంట్ గోడ దూకి లోపలికి వెళ్లేందుకు యువకుని యత్నం
- ఇంతియాజ్ ఖాన్ మార్గ్ వైపు గోడ దూకి పార్లమెంట్ అనెక్స్ భవనం పరిసరాల్లోకి ప్రవేశించిన యువకుడు
- అతనిని అదుపులోకి తీసుకుని క్షుణ్ణంగా తనిఖీ చేసిన సిఐఎస్ఎఫ్
- నిందితుడు యుపి అలీగఢ్ వాసి మనీశ్‌గా గుర్తింపు



న్యూఢిల్లీ : నిరుడు పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా లోక్‌సభలోకి ఇద్దరు దుండగులు దూసుకువెళ్లడం కలకలం రేపింది. తాజాగా మరొకసారి పార్లమెంట్‌లో భద్రత వైఫల్యం బయట పడింది. ఒక యువకుడు పార్లమెంట్ గోడ దూకి లోపలికి వెళ్లేందుకు యత్నించాడు. శుక్రవారం మధ్యాహ్నం పార్లమెంట్ అనెక్స్ భవనం ఆవరణలోకి గోడ దూకి లోపలికి వచ్చినట్లు అధికార వర్గాలు తెలియజేశాయి.శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మధ్యాహ్నం 2.45 గంటల ప్రాంతంలో 20 ఏళ్ల యువకుడు ఒకడు ఇంతియాజ్ మార్గం వైపు ఉన్న గోడ దూకి పార్లమెంట్ అనెక్స్ భవనం పరిసరాల్లోకి ప్రవేశించాడు. అలా గోడ దూకి లోపలికి ప్రవేశించిన ఆ యువకుని కేంద్ర పారిశ్రామిక భద్రత దళం (సిఐఎస్ఎఫ్) సిబ్బంది అదుపులోకి తీసుకుని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నిందితుడి వద్ద ఎటువంటి ఆయుధాలూ లేవని నిర్ధారణ అయిన తరువాత అతనిని

మిగతా 2లో

## తొమ్మిదేళ్లుగా కడుతున్న బ్రిడ్జ్.. మూడోసారి కూలిపోయింది

- సుల్తాన్‌గంజ్-అగువాని గంగా నదిపై నిర్మాణం
- ఇప్పటికే రూ. 1717 కోట్లు వెచ్చించిన సర్కార్
- బీహార్ భాగల్పూర్ జిల్లాలో ఘటన



2

## పార్లమెంట్‌లో రక్తం వచ్చేలా కొట్టుకున్న ఎంపిలు..



- తుర్కియే పార్లమెంట్‌లో ఎంపిల డిష్యుం డిష్యుం
- అధికార, ప్రతిపక్ష ఎంపిల పరస్పర దాడులు
- ఒకరిపై ఒకరు పిడిగుద్దులతో విరుచుకుపడిన వైనం
- వర్కర్స్ పార్టీ నేత క్యాన్ అటలే విషయమై 16న జరిగిన చర్చే ఘర్షణకు కారణం

2లో

# డైలీ రిపోర్ట్

ఆదివారం
ఆగస్టు 18, 2024




# ఆగస్టు 15 లోగా రుణమాఫీ పూర్తి చేస్తామన్నారు.. ఎక్కడ చేశారు?: హరీశ్ రావు

**హైదరాబాద్:** తెలంగాణలో ఆగస్టు 15 తర్వాత రైతులంతా రుణవిముక్తులు అవుతారని సీఎం రేవంత్ రెడ్డి ఘనంగా ప్రకటనలు చేశారు.. ఇప్పుడు లెక్కలు చూస్తే కేవలం 22 లక్షల మంది రైతులకు, రూ.17 వేల కోట్ల రుణాలు మాత్రమే మాఫీ అయ్యాయని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. రైతు రుణమాఫీకి సంబంధించి గతంలో హరీశ్ రావుకు, కాంగ్రెస్ ప్రభుత్వానికి మధ్య ఛాలెంజ్ ల పర్వం కొనసాగిన విషయం తెలిసిందే. రైతు రుణమాఫీపై కాంగ్రెస్ పార్టీది బోగస్ హామీ అని, ఆగస్టు 15 లోగా రుణమాఫీ చేస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. ఈ క్రమంలోనే ఆగస్టు 15న రూ.2 లక్షల వరకున్న రైతుల రుణాలను మాఫీ చేస్తున్నట్లు వైరా సభావేదికపై సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ ప్రకటన తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికలో హరీశ్ రావును కించపరిచేలా పోస్టులు పెడుతున్నారు. దీనిపై శనివారం హరీశ్ రావు స్పందించారు. రైతు రుణమాఫీకి సంబంధించి తన సవాలు గురించి మాట్లాడేందుకు ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు.రైతు రుణమాఫీ విషయంలో రేవంత్ రెడ్డి బూటకపు మాటలు చెబుతున్నారని హరీశ్ రావు ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా ఓ మాట, ఇప్పుడొక మాట అన్నట్లుగా మాటలతో పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. ఆగస్టు 15 లోపు రాష్ట్రంలో సంపూర్ణ రుణమాఫీ చేస్తే తాను రాజీనామా చేస్తానన్నారు. అయితే, ప్రభుత్వం రుణమాఫీ పూర్తిగా చేయలేదని, పాక్షికంగా మాత్రమే చేసిందని తెలిపారు. రుణమాఫీ లెక్కల విషయానికి వస్తే కాంగ్రెస్ నేతలు, రేవంత్ రెడ్డి చెప్పిన మాటల ఆధారంగానే మాఫీ లెక్కలు పరిశీలించవచ్చని చెప్పారు. రేవంత్ రెడ్డి వివిధ సందర్భాలలో మాట్లాడిన మాటలను వినిపిస్తూ రుణమాఫీ ఎక్కడ పూర్తయిందో చెప్పాలని కాంగ్రెస్ నేతలను ప్రశ్నించారు.

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రూపొందించిన మేనిఫెస్టోలో రూ.40 వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. దీనికి సంబంధించిన పేపర్లను హరీశ్ రావు మీడియాకు చూపించారు. ప్రభుత్వంలోకి వచ్చాక రైతు రుణమాఫీపై కేబినెట్ మీటింగ్ తర్వాత ఈ మొత్తం నిధులు రూ.31 వేల కోట్లకు తగ్గించారని గుర్తుచేశారు. రుణమాఫీ అమలుకు రాష్ట్ర బడ్జెట్ లో రూ.26 వేల కోట్లు మాత్రమే కేటాయించారని హరీశ్ రావు చెప్పారు. దీనిపై తాను అసెంబ్లీలోనే ప్రభుత్వాన్ని నిలదీశానని గుర్తుచేశారు. "ఎన్నికల మేనిఫెస్టోలో 40 వేల కోట్లని అన్నారు.. కేబినెట్ సమావేశంలో 31 వేల కోట్లు చెప్పారు, బడ్జెట్ లో 26 వేల కోట్లు కేటాయించారు.

ఈ నిధులు ఎక్కడ సరిపోతాయి? ఎవరికి ఎగవెడతరు?" అని ప్రశ్నించినట్లు చెప్పారు. వైరా సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన తర్వాత నిజంగానే రుణమాఫీ పూర్తిచేశారే మోననే ఆశతో లెక్కలు చూశామని హరీశ్ రావు చెప్పారు. అయితే, రాష్ట్రంలో ఇప్పటి వరకు 22 లక్షల మంది రైతులకు రూ.17 వేల కోట్ల రుణాలు మాత్రమే మాఫీ అయినట్లు గుర్తించామని హరీశ్ రావు చెప్పారు. రుణమాఫీ పూర్తిచేయకుండా తనను రాజీనామా చేయమనడం కాదు.. రైతు రుణమాఫీ పాక్షికంగానే చేసినందుకు ప్రజలను క్షమాపణ కోరాలని, నిజాయితీ ఉంటే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు.

## దసరా నుంచి స్కిల్ యూనివర్సిటీలో కోర్సులు ప్రారంభం..

**హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష మేరకు రూపుదిద్దుకున్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో దసరా పండగ నుంచి కోర్సులు ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా దాదాపు 20కోర్సులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రాథమికంగా ఆరు కోర్సులను ముందుగా ప్రారంభించాలని నిర్ణయించినట్లు సీఎస్ వివరించారు. స్కిల్ యూనివర్సిటీ ప్రారంభం, విధివిధానాలు, కోర్సుల ప్రారంభం తదితర అంశాలపై ఇవాళ(శనివారం) ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించినట్లు సీఎస్ శాంతి కుమారి వెల్లడించారు.ఐచ్చర్ల వద్ద కేటాయించిన 57ఎకరాల స్థలంలో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన విషయాన్ని సీఎస్ గుర్తు చేశారు. నిర్మాణ పనులు ముగిసేంతవరకు తాత్కాలిక భవనంలో తరగతులు నిర్వహిస్తామని శాంతి కుమారి తెలిపారు. తరగతులను ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా, నాక్ లేదా నిథమ్ కళాశాలలో నిర్వహిస్తామని ఆమె చెప్పుకొచ్చారు. ఇప్పటికే విశ్వవిద్యాలయం ఛైర్మన్‌గా ఆనంద్ మహీంద్రాను, కో-ఛైర్మన్‌గా శ్రీనివాస సి.రాజును నియమించినట్లు పేర్కొన్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో దాదాపు 140కంపెనీలు భాగస్వామ్యం కావడానికి ఆసక్తి చూపుతున్నాయని, దాదాపు 20కోర్సులను ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు సీఎస్ శాంతి కుమారి వెల్లడించారు.తొలుత స్కూల్ ఆఫ్ ఈ-కామర్స్, లాజిస్టిక్స్ రిటైల్ విభాగంలో సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులను ప్రారంభిస్తామని సీఎస్ శాంతి కుమారి పేర్కొన్నారు. దేశంలో ప్రముఖ కార్పొరేట్ సంస్థలైన ఎస్బీఐ, ఎన్ఏసీ, డా.రెడ్డి, టీవీఏజీఏ, అదానీ, సీఐఐ కంపెనీలు భాగస్వాములుగా ఉండేందుకు అంగీకరించాయని ఆమె వెల్లడించారు. ఈ సంస్థలు తమ కంపెనీల్లోని వివిధ విభాగాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తాయని ఆమె పేర్కొన్నారు.

## తెలంగాణలోని పలు జిల్లాల్లో మరో ఐదు రోజుల పాటు వర్షాలు

కురిసే అవకాశముందని తెలిపింది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని, గాలులు గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో వీయవచ్చునని తెలిపింది. రేపటి నుంచి ఎల్లుండి వరకు పలు జిల్లాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురువవచ్చునని వెల్లడించింది.

ఆదిలాబాద్, కొమురంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. సోమవారం నుంచి మంగళవారం, మంగళవారం నుంచి బుధవారం, బుధవారం నుంచి గురువారం వరకు తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురువవచ్చునని వాతావరణ శాఖ వెల్లడించింది.

## తొమ్మిదేళ్లుగా కడుతున్న బ్రిడ్జ్.. మూడోసారి కూలిపోయింది

**పాట్నా:** బీహార్‌లో ఒక వంతెన నిర్మాణం తొమ్మిది సంవత్సరాలుగా సాగుతూ ఉంది. ఇప్పటి వరకు ప్రభుత్వం దీనిపై రూ. 1717 కోట్లు వెచ్చించింది. ఇప్పటికే రెండు సార్లు కూలిన ఈ వంతెన శనివారం మరొక మారు కూలిపోయింది. నిర్మాణంలో ఉండగానే ఇన్ని సార్లు కూలిన వంతెన నిర్మాణం పూర్తి అయిన తరువాత ఎన్ని రోజులు నిలుస్తుందని ప్రజలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలని భాగల్పూర్ జిల్లాలో సుల్తాన్‌గంజ్%-%అగువాని గంగా నది రూట్‌ల ప్రభుత్వం ఈ వంతెన నిర్మాణం చేపట్టింది. నాలుగు లేన్లతో నిర్మిస్తున్న ఈ వంతెన తొమ్మిది సంవత్సరాలు గడచినా పూర్తి కాకపోవడంతో ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటి వరకు కట్టిన వాటిలో రెండు పిల్లర్లు కూడా కూలిపోవడంపై నిపుణులు మండిపడుతున్నారు.కాగా, ఖగరియా జిల్లా కలెక్టర్ ఈ ఘటనపై మాట్లాడుతూ, వంతెన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించలేదనే విమర్శలపై పాట్నా హైకోర్టు స్పందించి, నిర్మాణ పనులపై స్టే ఇచ్చిందని తెలియజేశారు. ఇప్పటికే పూర్తయిన భాగాన్ని కూడా కూల్చివేయాలని కాంట్రాక్టర్‌ను హైకోర్టు ఆదేశించిందని ఆయన తెలిపారు. ఈ ఆదేశాలకు అనుగుణంగా వంతెన కూల్చివేత పనులు చేపట్టారని ఆయన చెప్పారు. ఖగరియా, భాగల్పూర్ జిల్లాలను కలుపుతూ గంగా నదిపై నిర్మిస్తున్న ఈ వంతెన కాంట్రాక్ట్‌ను ఎస్‌పి సింగ్లా సంస్థ దక్కించుకుంది. 2014లో నిర్మాణ పనులు చేపట్టింది. నిర్మాణం పూర్తి చేయడానికి ప్రభుత్వం విధించిన గడువును ఎనిమిది సార్లు పొడిగించింది. 2022లో వచ్చిన తుపాను కారణంగా నిర్మాణం దెబ్బ తిన్నది. ఆ తరువాత కూడా వంతెన కూలిపోవడంతో నాణ్యతపై సందేహాలు వ్యక్తమయ్యాయి.

## కల్లు గీత కార్మికుల హక్కులన్నీ అమరుల పోరాట త్యాగాల ఫలితమే : జంగన్న గౌడ్



**సంగారెడ్డి ఆగస్టు 17(డైలీ రిపోర్ట్):** బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న 374 వ జయంతిని ఊరూరాన ఘనంగా జరపాలని కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్ పిలుపునిచ్చారు బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న 374 వ జయంతి ఉత్సవాలను ప్రతి ఊరు ఊరునా ఘనంగా జరపాలని పిలుపునిచ్చారు. నేడు కల్లుగీత కార్మికులు పొందుతున్న హక్కులన్నీ అమలవుతున్న జీవోలన్నీ కల్లుగీత కార్మిక రంగంలో నాటి నైజాం కాలం నుండి నేటి వరకు ఈ గీత వృత్తిలో అమరులు నిర్వహించిన పోరాటాల ఫలితమే అని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్ ఈరోజు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దొరలు భూస్వాములు జమీందారుల ఆగడాలకు వ్యతిరేకంగా గీత వృత్తిలో గౌడ కులస్తులకే గీత కార్మికులకే చెట్లు కావాలని హర్రాజు కాంట్రాక్టు విధానం రద్దు చేయాలని దుర్మార్గమైన మైపూజ విధానం రద్దు కావాలని సొసైటీలలో టిఎఫ్టి లలో గీత కార్మికులు స్వేచ్ఛగా వృత్తి కొనసాగించుకునే వాతావరణం ఏర్పడాలని కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో 1955 నుండి అనేక ఉద్యమాలు పోరాటాల ప్రాణల త్యాగాలు చేసిన ఫలితమే కల్లుగీత కార్మికుల చేతులలో వృత్తి ఉన్నదని ఎక్స్రేషియోను ఐదు లక్షలకు సాధించుకున్నామని కొన్ని గ్రామాలకు భూమి కూడా సాధించుకున్నామని తెలిపారు. ఎక్సైజ్ అధికారుల ఆగడాలను లంచగొండితనాన్ని ఎదిరించి నిలబడ్డ సంఘం కల్లుగీత కార్మిక సంఘం అని ఈ సంఘంలో అమరజీవి పెద్దలు బొమ్మగాని ధర్మ బిక్షం, తొట్ల మలుసూరు, బైరు మల్లయ్య, దేశిని చిన్న మల్లయ్య అనేకమంది రాష్ట్రవ్యాప్తంగా అమరుల స్ఫూర్తితో కల్లుగీత కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్రంలో గీత కార్మికులను రాజకీయాలకతీతంగా సమీకరించి పోరాడుతుందని, ఎన్నికలకు ముందు కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం ఎక్స్రేషియోను 10 లక్షల రూపాయలకు పెంచాలని అన్ని జిల్లా కేంద్రాల్లో నీరా ప్రాజెక్టును నెలకొల్పాలని చెట్ల పెంపకానికి సొసైటీలకు ఐదు ఎకరాల భూమిని కొని ఇవ్వాలని తాటి ఈత ఉత్పత్తులను ప్రోత్సహించి శాస్త్రీయ పద్ధతిలో కల్లుగీతను అభివృద్ధి చేసి నూతనతరం ఈ వృత్తిలో కొనసాగే విధంగా చర్యలు చేపట్టుటకు గీత కార్మికుల సంక్షేమం సామాజిక భద్రత ఆర్థిక భరోసా ఇచ్చుటకు వెంటనే 5000 కోట్ల రూపాయల నిధులను కేటాయించాలని రాష్ట్రంలో ఉన్న రెండు లక్షల 50 వేల మంది సభ్యత్వం కలిగిన కల్లుగీత కార్మికులందరికీ తక్షణం సేఫ్టీ కిట్లను అందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## 26 లేదా.. ఆ తరువాత ఎప్పుడైనా డిఎస్సీ ఫలితాలు!

- అభ్యంతరాల స్వీకరణకు గడువు పెంచే అవకాశం - ఫైనల్ కీతోపాటే ఫలితాలు ప్రకటన

**హైదరాబాద్:** రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించిన డిఎస్సీ - 2024 పరీక్షలకి సంబంధించిన ఫలితాలను ఈ నెల 26న లేదంటే ఆ తరువాత ఎప్పుడైనా ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే డీఎస్సీ- 2024కి సంబంధించిన ప్రాథమిక కీని పాఠశాల విద్య శాఖ అధికారులు విడుదల చేశారు. స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ), లాంగ్వేజ్ పండిట్(ఎల్పీ), సెకండరీగ్రేడ్ టీచర్(ఎస్జీటీ),ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్(పీఈటీ) పోస్టులకి సంబంధించి వేర్వేరుగా ప్రాథమిక కీని విడుదల చేశారు. అభ్యర్థుకి సంబంధించిన రెస్పాన్స్ షీట్స్ ని కూడా పాఠశాల విద్య శాఖ అధికారిక వెబ్ సైట్ లోపొందుపరిచారు. ఈ నెల20వ తేది సాయంత్రం 5 గంటల వరకు ప్రాథమికి కీపై అభ్యంతరాలను స్వీకరించనున్నారు.అభ్యంతరాలను స్వీకరించిన అనంతరం ఫైనల్ కీని,ఫలితాలను ఒకేసారి ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఫైనల్ కీని విడుదల చేసి తరువాత కొద్ది రోజులు సమయం తీసుకొని ఫలితాలను ప్రకటిస్తే.. ఆ లోపు ఫైనల్ కీపై ఎవరైనా కోర్టును ఆశ్రయిస్తే మళ్ళీ తుది తీర్పు వచ్చే వరకు ఆగాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఫైనల్ కీతోపాటు ఫలితాలను కూడా ఒకేరోజు ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.అయితే ప్రాథమిక కీపై అభ్యంతరాలను ఈ నెల 20 వరకు స్వీకరిస్తామని ఇప్పటికే అధికారులు ప్రకటించినప్పటికీ..ప్రాథమిక కీపై అభ్యంతరాలను స్వీకరించడానికి వెబ్ సైట్ లో సాంకేతిక సమస్యలు తలెత్తినట్టు పాఠశాల విద్య శుక్రవారం(ఆగస్టు 16) సాయంత్రం ప్రకటించింది.




సమస్య ఆగస్టు 19 వరకు కొనసాగుతుందని ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రాథమిక కీపై అభ్యంతరాలను స్వీకరించడానికి మరో రెండు, మూడు రోజుల గడువును పొడిగించే అవకాశం ఉంటుందనే అభిప్రాయం డిఎస్సీ రాసిన అభ్యర్థుల నుంచి వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో ప్రాథమిక కీ పై అభ్యంతరాలను ఈ నెల 22 లేదా 23 వరకు స్వీకరించే అవకాశం వారు చెబుతున్నారు.దీంతో ప్రాథమిక కీ పై అభ్యంతరాలను స్వీకరించి .. అనంతరం ఫైనల్ కీని దాంతోపాటు ఫలితాలను అవకాశం ఉంటే ఈ నెల 26న ప్రకటించే అవకాశం ఉన్నట్టు అభ్యర్థుల్లో ప్రచారం సాగుతోంది. ఒకవేళ 26 ప్రకటించకపోతే ఈ నెలాఖరు నాటికి ఫలితాలను ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఫలితాల ప్రకటన అనంతరం వారం, 10 రోజుల్లో 1:3 మెరిట్ జాబితాను విడుదల చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.ఫైనల్ కీ తరువాతఫలితాలను ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

## క్షమాపణ చెప్పినప్పటికీ నోటీసులు వచ్చాయి... 24న మహిళా కమిషన్ ఎదుట హాజరవుతా: కేటీఆర్

మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తనకు ఈ మెయిల్ ద్వారా ఈ నోటీసులు అందాయన్నారు. 24న ఉదయం 11 గంటలకు మహిళా కమిషన్ ఎదుట హాజరై, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక మహిళలపై జరిగిన దాడులను వివరిస్తానని వెల్లడించారు.ఎనిమిది నెలలుగా మహిళలపై దాడులు, అత్యాచారాలు జరుగుతుంటే ఏం చర్యలు తీసుకున్నారో మహిళా కమిషన్‌ను అడుగుతానన్నారు. తాను చేసిన వ్యాఖ్యలకు గాను నిన్ననే బహిరంగ క్షమాపణ చెప్పానని... అయినప్పటికీ తనకు నోటీసులు ఎందుకు ఇచ్చారో తెలియదన్నారు. తాను చట్టాన్ని గౌరవించే వ్యక్తిని అన్నారు. తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ నేతలు అన్న మాటలను కూడా కమిషన్ దృష్టికి తీసుకువెళతానన్నారు.

**ప్రధాని మోదీకి రేవంత్ రెడ్డి టచ్‌లోకి వెళ్లారు...**

సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీ టచ్‌లోకి వెళ్లారని కేటీఆర్ ఆరోపించారు. తాను చనిపోయే సమయానికి బీజేపీలోనే ఉంటానని మోదీకి చెప్పినట్లుగా తెలిసిందన్నారు. ప్రధానితో అలా అన్నారో లేదో... ముఖ్యమంత్రి చెప్పాలని నిలదీశారు.

**రుణమాఫీపై క్షేత్రస్థాయికి వెళతాం...**

కాంగ్రెస్ పార్టీ చేసిన రుణమాఫీకి సంబంధించి తాము క్షేత్రస్థాయికి వెళ్లి వివరాలు సేకరిస్తామని కేటీఆర్ అన్నారు. తాము సేకరించిన డేటాను కలెక్టర్, సీఎస్‌లకు అందిస్తామన్నారు. ఎల్లుండి నుంచి డేటాను సేకరించి వారంలో పూర్తి చేస్తామని వెల్లడించారు.

## కోల్ కతా హత్యాచారం కేసు... 43 మంది డాక్టర్లపై బదిలీ వేటు

**కోల్‌కతా:** కోల్ కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ట్రైనీ డాక్టరుపై అత్యాచారం, హత్య ఘటనకు సంబంధించి దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో బెంగాల్ లోని మమతా బెనర్జీ ప్రభుత్వం కఠిన చర్యలకు దిగింది. ఏకంగా 43 మంది డాక్టర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పశ్చిమబెంగాల్ ఆరోగ్య శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. మరోవైపు, ఇంతమంది వైద్యులను బదిలీ చేయడంపై మెడికల్ విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు విమర్శలు గుప్పిస్తున్నారు. నిరసన ఉద్యమంలో పాల్గొన్నందుకు శిక్షగానే ఇంత మందిని బదిలీ చేశారని విమర్శించారు. ప్రభుత్వ చర్యను ఖండిస్తున్నామని యునైటెడ్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రకటించింది. డాక్టర్ల బదిలీలు పూర్తిగా అన్యాయమని తెలిపింది. హత్యాచార ఘటనలో బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, విధుల్లో ఉన్న వైద్యులకు భద్రత కల్పించాలంటూ తాము కోరుతున్న డిమాండ్లపై ఎట్టి పరిస్థితుల్లో వెనక్కి తగ్గబోమని స్పష్టం చేసింది.

## రేవంత్ రెడ్డి ప్రభుత్వ పనితీరుపై 72 శాతం మంది ప్రజల సంతృప్తి

టీమ్ వర్క్ వల్లే ఇది (ప్రజా సానుకూలత) సాధ్యమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబ పార్టీ కాదని మధుయాష్కీ గౌడ్ అన్నారు. తమకు జాతీయ నాయకత్వం, రాష్ట్ర నాయకత్వం ఉందన్నారు. కేబినెట్ మంత్రుల సహకారంతో రేవంత్ రెడ్డి పాలన అద్భుతంగా ఉందన్నారు. ఈ క్రెడిట్ కేవలం ఒక వ్యక్తిది కాదన్నారు. కెప్టెన్‌కు రావాల్సిన క్రెడిట్ ఆయనకు వస్తుందని, అదే సమయంలో కోచ్‌కు రావాల్సిన క్రెడిట్ కోచ్ కు వస్తుందన్నారు.

పాలన కూడా క్రికెట్ ఆట వంటిదేనని అభిప్రాయపడ్డారు. కోచ్, కెప్టెన్, బ్యాట్స్‌మెన్, బౌలర్లు... ఇలా ఇదో క్రికెట్ జట్టు అని భావించవచ్చునన్నారు.చాలా తక్కువ సమయంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం మంచి ఫలితాలు సాధించిందని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత లోక్ సభ ఎన్నికలు వచ్చాయని, దీంతో ఎన్నికల కోడ్ కారణంగా ఈ ఎనిమిది నెలల కాలంలో తమ ప్రభుత్వం పని చేయడానికి పరిమిత సమయమే దొరికిందన్నారు. ఈ సమయంలోనూ ప్రజలను ఆకట్టుకునేలా పనిచేశామన్నారు. లోక్ సభ ఎన్నికల కోడ్ కారణంగా మూడు నెలలు ఇబ్బందులు పడినట్లు చెప్పారు. తక్కువ వ్యవధిలోనే ప్రభుత్వం ఎంతో చేసిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ కవరేజీని రూ.10 లక్షలకు పెంపు వంటి హామీలను అమలు చేశామని షబ్బీర్ అలీ గుర్తు చేశారు. తమ ప్రభుత్వంలో మహిళలు, యువత, రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు... ఇలా అన్ని వర్గాల ప్రజలకూ ప్రయోజనం చేకూరిందన్నారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయడం చారిత్రాత్మకం అన్నారు. రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, ప్రతి నెల 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ హామీలను ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని కూడా నెరవేర్చిదిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఇప్పటికే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని, ఈ ఏడాదిలో మరో 30 నుంచి 40 వేల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు.

ప్రభుత్వం పనితీరుపై మెజార్టీ ప్రజలు సంతృప్తిగా ఉండటం ఆనందాన్ని ఇచ్చిందని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. ఈ క్రెడిట్ రేవంత్ రెడ్డి నాయకత్వానిదే అన్నారు. ఆయన నాయకత్వంలోనే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నామన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పంటల రుణమాఫీని అమలు చేయడం అంత తేలికైన విషయం కాదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు అందుతున్నాయన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో మంత్రి శ్రీధర్ బాబు చురుగ్గా వ్యవహరిస్తున్నారని కితాబునిచ్చారు. ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయమైనా ప్రజాస్వామ్య పద్ధతిలోనే ఉంటోందన్నారు. పరిపాలనలో ఏదైనా కీలక నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత వర్గాల అభిప్రాయాలను తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కానీ గత ప్రభుత్వ హయాంలో ఈ పరిస్థితి లేదన్నారు. ప్రజల ప్రయోజనాలు ఆలోచించకుండా... ఒకే వ్యక్తి గతంలో నిర్ణయాలు తీసుకునేవాడన్నారు. అందుకే కాళేశ్వరం వంటి ప్రమాదాలు జరిగాయన్నారు.

## పార్లమెంట్‌లో రక్తం వచ్చేలా కొట్టుకున్న ఎంపిలు..

**అంకారా :** ఎంపిలు బాహాబాహీకి దిగడంతో తుర్కియే పార్లమెంట్ శుక్రవారం రణరంగాన్ని తలపించింది. అధికార, ప్రతిపక్ష ఎంపిలు ఒకరిపై ఒకరు పిడిగుద్దుల వర్షం కురిపించుకున్నారు. దీనితో అధికార పార్టీకి చెందిన ఒక మహిళా ఎంపితో పాటు ప్రతిపక్ష నేత ఒకరు కూడా గాయపడ్డారు. 2013లో తుర్కియే ప్రధానిగా ఉన్న ఎర్డోగన్ పాలనను వర్కర్స్ పార్టీ ఆఫ్ తుర్కియే అధినేత క్యాన్ అటలే అనేక సార్లు సవాల్ చేశారు. దీనితో 2013లో ఎర్డోగన్ పాలనకు వ్యతిరేకంగా పలు మార్లు నిరసన ప్రదర్శనలు జరిగాయి. దానితో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలకు కారణం క్యానే అటలే అని పేర్కొంటూ తుర్కియే కోర్టు 2022లో ఆయనకు 18 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ప్రస్తుతం ఆయన జైలు శిక్ష అనుభవిస్తున్నారు, ఈ క్రమంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో క్యాన్ అటలే పార్లమెంట్ డిప్యూటీగా ఎన్నికయ్యారు. దానితో పార్లమెంట్‌కు హాజరయ్యేందుకు తనకు అవకాశం ఇవ్వాలని, తన పదవీ కాలం ముగిసిన వెంటనే మళ్లీ జైలు శిక్ష అనుభవిస్తానని అంటూ ఆయన కోర్టును ఆశ్రయించారు. దీనితో కోర్టు అటలేకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఇదే అంశంపై శుక్రవారం పార్లమెంట్‌లో చర్చ జరిగింది. మాటా మాట పెరగడంతో అధికార, ప్రతిపక్ష ఎంపిలు పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ దాడిలో ఇద్దరు ఎంపిలకు గాయాలయ్యాయి. కాగా, ఎంపిలు రక్తం వచ్చేలా కొట్టుకున్నట్లు సమాచారం. ఈ ఘర్షణపై ప్రతికూల పార్టీ నేత ఓజ్‌గుర్ ఓజెల్ మాట్లాడుతూ, ఎంపిలు కొట్టుకోవడం సిగ్గుచేటు అని అన్నారు. పార్లమెంట్‌లో ప్రజా ప్రతినిధులు ఇలా దాడులు చేసుకోవడం ఏమిటని ఆయన ప్రశ్నిస్తూ, నేలపై రక్తం పారుతోందని వాపోయారు. కనీసం మహిళా ఎంపిలను కనికరం లేకుండా కొడుతున్నారని విమర్శించారు. ఇక తుర్కియే చట్ట సభలో సభ్యులు ఇలా భౌతిక దాడి చేసుకోవడం ఇదే తొలిసారి కాదు. ఇంతకు ముందు కూడా పలు సందర్భాల్లో ఎంపిలు బాహాబాహీకి దిగి కొట్టుకున్న ఘటనలు చాలా ఉన్నాయి.

## మరోసారి పార్లమెంట్‌లో భద్రత వైఫల్యం

ఢిల్లీ పోలీసులకు అప్పగించారు. కాగా, నిందితుని ఉత్తర ప్రదేశ్‌లోని అలీగఢ్‌కు చెందిన మనీశ్‌గా గుర్తించారు. అతనిని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి అక్కడ అధికారులు ప్రశ్నించారు. ఎత్తుగా ఉన్న ఆ గోడను అలా ఎక్కాడు అని తెలుసుకునేందుకు సిసిటివి ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నామని పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. అదే విధంగా పార్లమెంట్ ప్రాంగణంలోకి ఎందుకు ప్రవేశించాడనేది కూడా దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కాగా, మనీశ్ తన పేరు సరిగ్గా చెప్పలేకపోవడంతో అతని మానసిక పరిస్థితి సరిగ్గా లేదని ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు తెలియజేశారు. నిరుడు డిసెంబర్ 13న పార్లమెంట్ శీతాకాల సమావేశాల వేళ లోక్‌సభలోకి ఇద్దరు దుండగులు దూసుకువెళ్లడం కలకలం రేపిన విషయం విదితమే. లోక్‌సభలోని పబ్లిక్ గ్యాలరీ వద్ద కూర్చున్న యువకులు సభలోకి దూకి గందరగోళం సృష్టించారు. పసుపు రంగు పొగ వెదజల్లుతూ వారు ఎంపిలను భయభ్రాంతులకు గురి చేశారు. ఆ సంఘటన తరువాత పార్లమెంట్‌లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. సిఐఎస్ఎఫ్ సిబ్బందిని మోహరించి భద్రతను పర్యవేక్షిస్తున్నారు.

## కేఏ.పాల్ చారిటీ ట్రస్ట్ భూములను ఆక్రమణదారుల నుండి పరిరక్షించాలి



**సంగారెడ్డి, ఆగస్టు 17 (డైలీ రిపోర్ట్) :** సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేఏ పాల్ మాట్లాడుతూ సదాశివపేటలో ఉన్నటువంటి గం సిటీకి చారిటబుల్ ట్రస్ట్ కు సంబంధించిన భూములను కొందరు కావాలని కుట్రపూరితంగా ఆక్రమించాలని ప్రయత్నిస్తున్నారని అదేవిధంగా గం సిటీ సదాశివ్పేటలో ఉన్న సిబ్బందిని కొందరు భౌతిక దాడి చేయడం జరిగిందని, ఈ విషయమై జిల్లా ఎస్పీ రూపేష్ కు ఫిర్యాదు చేయడం కూడా జరిగిందన్నారు. కొందరు దురాక్రమణదారుల నుండి గం సిటీ చారిటీ ట్రస్ట్ సంబంధించిన భూములను ఆక్రమణల గురికాకుండా పరిరక్షించాలని, భౌతిక దాడులను చేస్తున్న వారిని చట్టప్రకారం శిక్షించాలని శనివారం కలెక్టర్ కి వివరించి, వినతిపత్రం అందజేయడం జరిగిందనీ సమావేశంలో కేఏ పాల్ తెలియజేశారు.

## దోమల నివారణకు మందు స్ప్రేయింగ్

**శంకర్‌పల్లి: ఆగస్టు 17:(డైలీ రిపోర్ట్):** దోమలు వృద్ధి చెందకుండా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకున్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా శనివారం దోమల మందు పిచికారి చేశారు. మలేరియా, డెంగ్యూ లాంటి విషజ్వరాలు ప్రబలకుండా దోమల నివారణలో భాగంగా పట్టణంలోని పలు వార్డులలో దోమల మందు పిచికారి చేయించామని మునిసిపల్ అధికారులు తెలిపారు.

## సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని జయప్రదం చేయండి : రజిత వీరబోయిన





**రవీంద్రభారతి,ఆగస్టు 18(డైలీ రిపోర్ట్):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి నేడు 10:30 గంటలకు రవీంద్ర భారతిలో జరిగే శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి జయప్రదం చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు రజిత వీరబోయిన కోరారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి ,డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క , బీసీ సంక్షేమ శాఖ మాత్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ గౌడ్ లతో పాటు మంత్రి వర్గమంతా హాజరు కానున్నట్లు కమిటీ ప్రకటించింది. కావున గౌడ జనులంతా పెద్ద ఎత్తున రవీంద్ర భారతికి ఆదివారం ఉదయం 9 గంటలకే విచ్చేసి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని జయప్రదం చేయవలసిందిగా ఆమె కోరారు.



## ప్రజాస్వామ్యంలో పాత్రికేయుల పాత్ర: ప్రజల స్వరంగా, మార్పు రవ్వగా

**- యంగలి గోపి గౌడ్**



ప్రజాస్వామ్యం అనేది ప్రజల చేత అంగీకరించబడిన, వారి హక్కులను కాపాడే, సమానత్వం, స్వేచ్ఛలకు ప్రాతినిధ్యం వహించే గొప్ప వ్యవస్థ. ఇందులో పాత్రికేయులు సత్యాన్ని వెలుగులోకి తెచ్చే వారధిలా ఉంటారు, అన్యాయాన్ని నిలదీస్తారు, మరియు ప్రభుత్వాన్ని జవాబుదారీతనం కలిగి ఉండేలా చేస్తారు. "సత్యం ఎల్లప్పుడూ! న్యాయం అందరికీ!" అనే నినాదాన్ని బలపరచుతూ, పాత్రికేయులు సవాళ్లను అధిగమించి, సామాజిక మార్పు తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తారు. పాత్రికేయులు నిజాయితీ, నైతికత పునాదులపై పనిచేసి, అవినీతి, అక్రమాలు, మరియు అన్యాయాలను ప్రజల ముందుకు తెచ్చే బాధ్యతను స్వీకరిస్తారు. "ప్రజాస్వామ్యంలో సత్యం వేకువ వెలుగులు" అన్న నినాదంతో, వారు ప్రజల మనోగతాలను ప్రతిబింబించేందుకు, వాటిని అధికారుల చెవుల్లోకి పుచ్చించేందుకు నిరంతరం శ్రమిస్తారు. భారతీయ ప్రజాస్వామ్యంలో పాత్రికేయులు, వార్తలను కేవలం ప్రసారం చేసే వ్యక్తులు కాకుండా, "ప్రజల గళం, ప్రజల గౌరవం" అనే నినాదం కింద మార్పుకు మార్గదర్శకులుగా నిలుస్తారు. వారు స్వతంత్రంగా పని చేసి, ప్రజలను సామాజిక చైతన్యానికి, న్యాయానికి ప్రేరేపించే శక్తివంతమైన నాయకులు అవుతారు. "ప్రతిక్షణం న్యాయస్వామ్యం, ప్రతిక్షణం ప్రజాస్వామ్యం" అన్న నినాదం కింద, వారు ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రాణం పోసేందుకు, ప్రజల హక్కులను కాపాడేందుకు కృషి చేస్తారు. పాత్రికేయులు గౌరవప్రదమైన స్థానం పొందడానికి, సత్యం, న్యాయం మరియు స్వేచ్ఛ కోసం అంకిత భావంతో కట్టుబడతారు. "ప్రజల సత్యం, ప్రజల హక్కు, ప్రజల న్యాయం" అనే నినాదం పై వారు తమ గళాన్ని వినిపిస్తూ, ప్రజాస్వామ్యం పునాది లో వెలుగును ప్రతిబింబిస్తారు. "ప్రజల సమాధానాలు, ప్రజల ప్రశ్నలు" అనే నినాదం ఆధారంగా, పాత్రికేయులు ప్రజల బాధ్యతను గుర్తుచేసి, ప్రజాస్వామ్యానికి జీవం పోస్తారు. ఈ విధంగా, ప్రజాస్వామ్యంలో పాత్రికేయులు ఒక సమాజానికి కేవలం వార్తలను అందించే వ్యక్తులుగా మాత్రమే కాకుండా, సత్యాన్వేషణ, న్యాయ సాధన, మరియు స్వేచ్ఛలను కాపాడే అమరావళిలా నిలుస్తారు. "సమాజ మార్పుకు సజీవ శక్తులు" అన్న నినాదం కింద, వారు ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు గళం నిచ్చి, ఆ గళం మార్పు తెచ్చే శక్తిగా అవతరిస్తుంది.



**- వ్యాసకర్త : యంగలి గోపి గౌడ్**

# ఆర్డీవో సమావేశాన్ని బహిష్కరించిన పెద్దాపూర్, గిర్మాపూర్ గ్రామ రైతులు

- ట్రిపుల్ ఆర్ అలైన్మెంట్ను మార్చాలి
- ట్రిపుల్ ఆర్‌కు భూములు ఇచ్చేది లేదు
- ఆర్డిఓ ఆఫీసు వద్ద ధర్నా

**సంగారెడ్డి, ఆగస్టు 17 (డైలీ రిపోర్ట్):** కొండాపూర్ మండలం గిర్మాపూర్, సదాశివపేట పెద్దపూర్ గ్రామ రైతులు నేడు సంగారెడ్డి ఆర్డీవో ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఆర్ సమావేశం బహిష్కరణ చేయటం జరిగింది. ఆర్ఆర్ఆర్ రోడ్డు నిర్మాణ పనులకు మా భూములు ఇవ్వకూడదని ఏకగ్రీవంగా తీర్మాణం చేస్తామని అన్నారు. ఇప్పటికే గ్రామస్థుల భూములు నేషనల్ హైవే, పెద్దపూర్ ఫిల్టర్బెడ్, మంజీరపైపులైన్, చెరువులు, కాల్వల నిర్మాణం వంటి వాటికి పోయి రైతులు కూలీలుగా మారుతున్నారు. ప్రస్థుతం రెండు పంటలు పండే భూములను తీసుకుంటే మాకు ఎలాంటి జీవనాదారం లేకుండా అవుతుంది. ఊరికి ఉత్తరాన మంజీర డ్యాం, ఫిల్టర్బెడ్లు, దక్షిణాన మల్కాపూర్ పెద్ద ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. వీటన్నింటి మధ్య నుండి రింగ్ రోడ్డు వేయడం రైతుల నోట్లో మట్టికొట్టడమే అవుతుంది. ప్రస్థుతం ఉన్న ఆర్ఆర్ఆర్ అలైన్మెంట్ను మార్చాలని కోరుతున్నాము. ఇప్పటికే సంగారెడ్డి ప్రక్కన ఉన్న నాందేడ్ అకోలా రోడ్డు శివంపేట నుండి కంది ఐఐటి వరకు నేషనల్ హైవే రోడ్డు ఉంది. దీనిని శంకర్పల్లికి జతచేయడం వలన చింతల్పల్లి, తాళ్ళపల్లి, కల్పగూర్, కులబూర్, ఇరిపల్లి, గిర్మాపూర్, పెద్దపూర్ భూ సేకరణ మిగిలిపోతుంది. ప్రభుత్వానికి బడ్జెట్ కూడా మిగులుతుంది. మా రైతుల అభిప్రాయాలను మీరు పరిగణలోకి తీసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరారు.రైతులకు మద్దతు రైతు సంఘాల నాయకులు గొల్లపల్లి జయరాజు, పృథ్వీరాజు రాఘవేందర్ రెడ్డి ,టీ జే ఎస్ తుల్జా రెడ్డి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిర్మాపూర్ మాజీ సర్పంచ్ మల్లేశం పెద్దాపూర్ మాజీ సర్పంచ్ మల్లేశం గ్రామ రైతులు పాల్గొన్నారు.



# 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి

- ఆగస్టు 20 నుంచి బి.ఎల్.ఓ ఇంటింటి సర్వే చేపట్టాలి - అక్టోబర్ 29న ముసాయిదా ఓటర్ జాబితా విడుదల, నవంబర్ 28 వరకు అభ్యంతరాల స్వీకరణ - ఓటరు నమోదు కార్యక్రమం పై రాజకీయ పార్టీలతో సమావేశం
- ఓటరు జాబితా సవరణ 2025 పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించిన రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి

**సంగారెడ్డి ఆగస్టు 17 (డైలీ రిపోర్ట్):** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటరు జాబితాలో చోటు కల్పిస్తూ పకడ్బందిగా రూపొందించాలని, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ సీఈఓ కార్యాలయం నుంచి అదనపు సీఈఓ లోకేష్ కుమార్ తో కలిసి ఓటరు జాబితా సవరణ 2025 పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ క్యాంప్ నుంచి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, జనవరి 1, 2025 ప్రామాణికంగా ఓటర్ జాబితా సవరణ 2025 కట్టుదిట్టంగా నిర్వహించాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటరు జాబితాలో చోటు కల్పించేలా కార్యాచరణ అమలు చేయాలని తెలిపారు. జిల్లాలో ఓటరు జాబితా నమోదు ప్రక్రియ పై అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలని ఆయన అధికారులకు సూచించారు.

ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 28 వరకు ప్రీ రివిజన్ నిర్వహించి అక్టోబర్ 29న ముసాయదా ఒటరు జాబితా విడుదల చేయాలని, నవంబర్ 28, 2024 వరకు సదరు జాబితా పై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వికరించాలని, రెండు శనివారాలు, ఆదివారాలు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని , డిసెంబర్ 24, 2024 లోగా అభ్యంతరాలను ,ఓటర్ క్లెయిమ్స్ ను పూర్తి స్థాయిలో పరిష్కరించి, జనవరి 6 ,2025 న తుది ఓటరు జాబితా రుపోందించాలని తెలిపారు. ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18,2024 వరకు బూత్ స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల వారిగా ఇంటింటికి తిరుగుతూ ఓటరు ధృవీకరణ చేపట్టాలని, ఓటరు జాబితాలో అవసరమైన చోట పాత ఫోటోలను తొలగించి ఓటర్ల నూతన ఫోటోలు అప్లోడ్ చేయాలని, జనవరి 1,2025 నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు చేయాలని అన్నారు. ఓటర్ల జాబితాలో ఉన్న లాజికల్ పొరపాట్లు, డెమో గ్రాఫికల్ పొరపాట్లను పూర్తి స్థాయిలో సవరించాలని అధికారులను ఆదేశించారు. మరణించిన ఓటర్ల వివరాలను, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల వివరాలను ఓటర్ జాబితా నుంచి ఫారం 7 ద్వారా తొలగించాలని అన్నారు. 1500 మంది ఓటర్లకు మించి ఉన్న పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ చేయాలని , అవసరమైన చోట నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు. ఓటర్ జాబితాలో ఉన్న మల్టీ ఎంట్రీలను తొలగించాలని, అదేవిధంగా ఓటర్ కార్డు పై ఉన్న పొరపాట్లు పరిష్కరించాలని కలెక్టర్ లకు సూచించారు. ఒటరు నమోదు కు సంబంధించి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం వారిగా ప్రత్యేక కార్యక్రమాలు రుపొందించి అమలు చేయాలని సూచించారు. ఓటరు నమోదు కార్యక్రమానికి సంబంధించి జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని అన్నారు . వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లాలో ఓటరు జాబితా రూపకల్పనలో ఇంటింటి సర్వే , ఇ.ఆర్.ఓ., ఎఇఆర్, సూపర్వైజర్ల పర్యవేక్షణలో బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటి సర్వే చేపడతారని, ఇందుకోసం నియోజక వర్గ స్థాయిలో మాస్టర్ ట్రైనర్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, బూత్ లెవల్ ఆఫీసర్ వద్ద ఎలక్టోరల్ జాబితా, పోలింగ్ స్టేషన్ మ్యాప్, విఐపి ఓటర్ల వివరాలు ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బూత్ లెవల్ ఆఫీసర్లు తమ ఉన్న బి.ఎల్.ఓ. యాప్ లో ఓటర్ల వివరాలను నమోదు చేయడం జరుగుతుందని తెలియచేస్తూ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి సూచనలు, అభిప్రాయాలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఇంటింటి సర్వే చేపట్టి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తామని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సు లో అదనపు కలెక్టర్ మాధురి పాల్గోన్నారు.





# అర్హులకు పోడు పట్టాల అందించేందుకు పటిష్ట కార్యాచరణ


**- రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయల శాఖ మంత్రి కొండా సురేఖ**

**సంగారెడ్డి ఆగస్టు 17 (డైలీ రిపోర్ట్):** అర్హులకు పోడు పట్టాల అందించేందుకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని రాష్ట్ర అటవీ ,పర్యావరణ దేవాదాయశాఖ మంత్రి కోండా సురేఖ తెలిపారు. శనివారం రాష్ట్ర అటవీ ,పర్యావరణ దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాదులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దాసరి అనసూయ (సీతక్క) తో కలిసి , పోడు భూముల పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు , ఇంచార్జ్ గిరిజన సంక్షేమ అధికారి అఖిలేష్ రెడ్డి తో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.రాష్ట్రంలో అటవీ భూముల విస్తీర్ణం, ఆర్.ఓ.ఎఫ్.ఆర్ చట్టం, జారీ చేసిన పోడు భూముల పట్టాలు, పెండింగ్ ఉన్న దరఖాస్తులు మొదలగు వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉన్నత అధికారులు వివరించారు. ఆర్ ఓ ఎఫ్ ఆర్ చట్టం ప్రకారం 13 డిసెంబర్ 2005 నాటికి సాగు చేస్తున్న గిరిజనులు, లేదా 13 డిసెంబర్ 2005 నాటికి మూడు తరాలపాటు సాగు చేసిన గిరిజనేతరులకు పోడు భూముల పట్టా పంపిణి అర్హులని అధికారులు పేర్కొన్నారు. మన రాష్ట్రంలో ఇప్పటి వరకు 2,30,735 మంది అర్హులను గుర్తించి వారికి 6,69,676 ఎకరాల అటవీ భూమి పట్టాలు పంపిణీ చేశామని తెలిపారు.

ఈ సందర్భంగా రాష్ట్ర అటవీ ,పర్యావరణ దేవాదాయశాఖ మంత్రి కోండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు ఆమోదించిన ఆర్ఓఎఫ్ఆర్ దరఖాస్తుల పట్టాలు లబ్ధిదారునికి చేరాయో లేదో నివేదిక అందించాలని అధికారులకు సూచించారు. మన రాష్ట్రంలో ఇప్పటివరకు పంపిణీ చేసిన పోడు పట్టాల వివరాలు, పెండింగ్ ఉన్న దరఖాస్తులు, ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో సాగు జరుగుతున్న అటవీ భూముల వివరాలతో కూడిన నివేదిక అటవీశాఖ, గిరిజన శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా రూపొందించి సమర్పించాలని మంత్రి ఆదేశించారు. పోడు భూముల పట్టా కోసం పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, అర్హత ఉంటే వారికి పట్టా పంపిణీకి చర్యలు తీసుకోవాలని, సదరు దరఖాస్తును తిరస్కరించే పక్షంలో దానికి గల కారణాలను స్పష్టంగా తెలియజేస్తూ నివేదిక అందించాలని అన్నారు. ఆర్ఓఎఫ్ఆర్ చట్టం ప్రకారం గతం నుంచి సాగు చేసుకుంటున్నా అటవీ భూములకు మాత్రమే పట్టాలు అందించాలని, కొత్తగా రాష్ట్రంలో ఇంచ్ అటవీ భూమి కూడా సాగు చేయడానికి వీలు లేదని, అటవీ భూముల సంరక్షణకు అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, ఎక్కడా నూతన ఆక్రమణలు జరగడానికి వీలులేదని మంత్రి స్పష్టం చేశారు. ఆర్ఓఎఫ్ఆర్ చట్టం పై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలని, తెలంగాణ రాష్ట్ర గిరిజనులకు,ఆదివాసీలకు మాత్రమే పట్టాలు మంజూరు చేయాలని, వలస వచ్చి నూతనంగా అటవీ ప్రాంతంలో చెట్లు నరికివేత చేయాలని చూస్తే కఠినంగా వ్యవహరించాలని మంత్రి పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దాసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, గిరిజనులకు అటవీశాఖ వ్యతిరేకం అనే భావన తొలగించే విధంగా అధికారులు పని చేయాలని అన్నారు. కొత్తగా అడవుల నరికివేత జరగకుండా అటవీ శాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, అటవీ భూములు చెట్ల నరికివేత వల్ల కలిగే నష్టాలను విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రి తెలిపారు. అటవీ భూముల్లోనీ అటవీ సంపద అక్రమ రవాణా జరుగకుండా పక్కా నిఘా ఏర్పాటు కావాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్ పోడు భూముల పట్టా దరఖాస్తులను, మరోసారి పరిశీలించాలని సూచించారు. ఆర్ఓఎఫ్ఆర్ చట్ట ప్రకారం అర్హులందరికీ పట్టాలు అందజేయాలని తెలిపారు. అటవీ భూముల అనుమతుల కారణంగా గిరిజన, ఆదివాసీ ప్రాంతాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రోడ్డు సౌకర్యం, త్రాగు నీరు , ఆసుపత్రి వంటి మౌలిక వసతుల కల్పన పనులకు అటవీ అనుమతులు త్వరగా వచ్చేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మంత్రి ఆదేశించారు. పట్టాలు మంజూరు చేసిన పోడు భూములలో రైతులు పామ్ ఆయిల్, జీడి మామిడి తోటలు మొదలగు లాభదాయక పంటలు సాగు చేసేలా రైతులకు అవసరమైన సహకారాలు, సూచనలు అందించాలని మంత్రి తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## శంకర్‌పల్లి బిజెపి మున్సిపల్ కార్యదర్శిగా బిసోల్ల వెంకటేష్



**శంకర్‌పల్లిఆగస్టు 17:(డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి బిజెపి మున్సిపల్ కార్యదర్శిగా బిసోళ్ళ వెంకటేష్ నియమితులయ్యారు. శనివారం మునిసిపల్ అధ్యక్షుడు సురేష్ యాదవ్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి అభ్యర్థుల గెలుపునకై పాటు పడతానని పేర్కొన్నారు.

## డెంగ్యూ సోకి బాలుడు మృతి




**శంకర్‌పల్లి ఆగస్టు 17 (డైలీ రిపోర్ట్):** డెంగ్యూ జ్వరంతో బాధపడుతూ ఓ బాలుడు మృతి చెందిన ఘటన శంకర్‌పల్లి మండలం టంగుటూరు గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని టంగుటూరు గ్రామానికి చెందిన అబ్బగోని మహేష్ గౌడ్, సంధ్యల కుమారుడు గౌతమ్ సాయి (10) నాలుగు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. వైద్యం కోసం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఆసుపత్రికి తరలిస్తుండగా బాలుడు మృతి చెందినట్లు తెలిపారు. బాలుడు మృతి పట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మున్సిపల్ పరిధిలోని నారాయణ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. బాలుడి మృతికి నిరసనగా పాఠశాలను బంద్ చేశారు.

# ప్రగ్యాజైశ్వాల్ బ్లాక్ మ్యాజిక్ మత్తెక్కించేలా!



ప్రగ్యా జైశ్వాల్ ఇన్ స్టా యాక్టివిటీ గురించి చెప్పేదేముంది. చిట్టిపొట్టి దుస్తుల్లో మంటలు రేపిన సంద ర్భాలెన్నో. ఫ్యాషన్ వరల్డ్ లో తానో బ్రాండ్ అని ఎప్పుడో ప్రూవ్ అయింది. చేతిలో సినిమాలు లేకపోయినా ఇంకా కాంపిటీషన్ లో ఉంది అంటే? అందుకు కారణం ప్రగ్యా లో ఆ రకమైన అప్పిరియన్స్ అనడంలో డౌట్ లేదు. సందర్భాన్ని బట్టి చిచ్చర పిడుగులా చెలరేగుతుంది. డిజైనర్ దుస్తుల్లో అగ్గిరాజేస్తుంది. తాజాగా అమ్మడు మరోసారి బ్లాక్ కలర్ దుస్తుల్లో సెగలు పుట్టించిన వైనం అసాధారణం. టాప్ అండ్ బాటమ్ లో బ్లాక్ అందాల్లో కవ్వింపు చర్య ఆహా అనిపించక మానదు. పాల నురుగుల సౌందర్యంపై బ్లాక్ కాంబినేషన్ లో మరింత అందంగా హైలైట్ అయింది. చెవులకు ఎంపిక చేసుకున్న యాక్సరసీస్... మరో చేతికి మెరిసిపోతున్నరింగులు సంథింగ్ స్పెషల్ గా నిలిచాయి. సెగలు పుట్టించే స్కిన్ షో తో మత్తెక్కిస్తుంది. బ్లాక్ కలర్ చైర్ పై వివిధ భంగిమల్లో కెమెరాకి ఇచ్చిన ఫోజులు ఫ్యాషన్ ప్రియుల్ని ఆకట్టుకుంటున్నాయి. కాళ్లకు హై హీల్స్ ధరించింది. వయసు 36 దాటినా 26 బ్యూటీలా మురిపిస్తుంది. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ప్రగ్యా లో బ్యూటీని ఫ్యాన్స్ అంతే ఆస్వాదిస్తున్నారు. కామెంట్ బాక్సులో నెటి జనుల కామెంట్లు అంతే ఆసక్తికరం. ఇక ప్రపోజల్స్ కైతే కొదలేదు. బ్యూటీ అందానికి ఫిదా అయిన వారంతా తమదైన శైలిలో ప్రపోజ్ చేస్తున్నారు. ఇక ప్రగ్యాజైశ్వాల్ కెరీర్ గురించి చెప్పాల్సిన పనిలేదు. తెలుగు..హిందీ..తమిళ్ లో సినిమాలు చేసినా ఎక్కడా నిలదొక్కుకోలేకపోయింది. ఈ రెండు భాషలకంటే బెటర్ గా తెలుగులోనే సినిమాలు చేసింది. ఇటీవలే ఖేల్ ఖేల్ మే చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చిన సంగతి తెలిసిందే.

# ప్రభాస్ 'వర్షం'.. హిందీలో నాలుగోసారి!

ఒకే అమ్మాయిని ప్రేమించే హీరో - విలన్ మధ్య బిగ్ ఫైట్ నేపథ్యంలో ఆద్యంతం రక్తి కట్టించే స్క్రీన్ ప్లేతో దర్శకుడు శోభన్ తెరకెక్కించిన 'వర్షం' ప్రభాస్ కెరీర్ లోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఇది తెలుగు సినిమా స్క్రీన్ ప్లే ఫార్మాట్‌లలో అత్యుత్తమ పంథాలో రూపొందిన క్లాసిక్. పరుచూరి బ్రదర్స్, వీరూ కే వంటి పలువురు రచయితలు ఈ సినిమా కోసం పని చేసారు. ప్రభాస్-త్రిష మధ్య లవ్ కెమిస్ట్రీని వర్కవుట్ చేయడంలో దర్శకుడు శోభన్ పెద్ద సక్సెసయ్యారు. దేవీశ్రీ మ్యూజిక్ ప్రధాన అస్సెట్ గా నిలిచింది. అదంతా అటుంచితే 'వర్షం' స్ఫూర్తితో రూపొందించిన 'భాఘీ' (పాక్షిక రీమేక్) కూడా హిందీ చిత్రసీమలో భారీ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. బాఘీ అంటే రెబల్ అని అర్థం. ఈ చిత్రంలో టైగర్ ష్రాఫ్ - శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలు పోషించారు. సుధీర్ బాబు అతని హిందీ అరంగేట్రం చేయగా, సునీల్ గ్రోవర్ సహాయక పాత్రలో నటించారు. దీనికి సబ్బీర్ ఖాన్ దర్శకత్వం వహించారు. 2016 లో ఈ హిందీ భాషా యాక్షన్ థ్రిల్లర్ విడుదలైంది. నదియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై సాజిద్ నడియాద్వాలా నిర్మించారు. బాఘీ 29 ఏప్రిల్ 2016న ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. విమర్శకుల నుండి మిశ్రమ సమీక్షలను అందుకుంది. రూ.35 కోట్ల బడ్జెట్‌తో రూపొందించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.129 కోట్లు వసూలు చేసింది. తరువాత బాఘీ 2 (2018), బాఘీ 3 (2020) పేరుతో రెండు సీక్వెల్‌లను రూపొందించారు. తద్వారా బాఘీ ఫిల్మ్ సిరీస్ ప్రజల హృదయాల్లో నిలిచింది. తాజా సమాచారం మేరకు టైగర్ ష్రాఫ్ నాలుగు సంవత్సరాల



విరామం బాఘీ ఫ్రాంచైజీ నాల్గవ భాగంలో నటించేందుకు సన్నాహకాల్లో ఉన్నాడని తెలిసింది. హై-ఆక్టేన్ యాక్షన్ చిత్రంలో టైగర్ ష్రాఫ్ టోన్డ్ ఫిజిక్, మార్షల్ ఆర్ట్స్ స్కిల్ మైమరిపిస్తాయని అంచనా వేస్తున్నారు. బాఘీ 4 కూడా ఈ ఫ్రాంఛైజీలో అత్యుత్తమ ఫలితం అందుకుంటుందని భావిస్తున్నారు. తాజాగా అందిన సమాచారం మేరకు.. ఈ చిత్రానికి దర్శకత్వం వహించడానికి, దక్షిణ భారత దర్శకుడి కోసం వెతుకుతున్నట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. ఇటీవల బాలీవుడ్‌లో కొనసాగుతున్న ధోరణికి ఇది కొనసాగింపు. దక్షిణాది ప్రతిభపై వారి నమ్మకానికి ఇది సూచిక. ప్రొడక్షన్ హౌస్ సమాచారం ప్రకారం.. బాఘీ 4 ప్లానింగ్ దశలో ఉంది. ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలో చిత్రీకరణ ప్రారంభమవుతుంది. అయితే సికందర్, హౌస్‌ఫుల్ 5 చిత్రాల సహ నిర్మాత సాజిద్ నదియాడ్‌వాలా ఫ్లెక్సిబిలిటీపై ఈ ప్రాజెక్ట్ ఆధారపడి ఉంది. సికందర్ చిత్రీకరణ వేగంగా పూర్తవుతోంది. హౌస్‌ఫుల్ 5 త్వరలో చిత్రీకరణకు వెళుతుంది. ఇంతలోనే బాఘీ 4 అధికారికంగా ఎప్పుడు ప్రారంభమవుతుంది? అనేది తెలుసుకోవాలని అభిమానులు ఆసక్తిగా ఉన్నారు. భాఘి ఫ్రాంఛైజీలో పార్ట్ 1 కి సబ్బీర్ ఖాన్, 2,3 భాగాలకు అహ్మద్ ఖాన్ దర్శకత్వం వహించారు. ఇప్పుడు ఒక దక్షిణాది దర్శకుడిని ఎంపిక చేయాలని భావిస్తున్నారు. దీనివల్ల పాన్ ఇండియాలో అప్పీల్ ఉంటుందని భావిస్తున్నారు. దర్శకుడిని నిర్ధారించిన తర్వాత, కథానాయిక, ఇతర నటీనటుల ఎంపిక గురించి వెల్లడిస్తారు. నటీనటుల ఎంపికల ప్రక్రియ గురించి వెల్లడవుతుంది.

# సౌత్ ఇండస్ట్రీపైనే అమ్మడి గురి..?



మోడల్ గా చేసి ఆ క్రేజ్ తో సిల్వర్ స్క్రీన్ ఎంట్రీ ఇచ్చిన బ్యూటీ కృతి సనన్ మొదటి సినిమానే సూపర్ స్టార్ మహేష్ తో 1 నేనొక్కడినే సినిమా తో క్రేజీ ఛాన్స్ అందుకుంది. ఆ సినిమా హిట్ అయితే పరిస్థితి ఎలా ఉండేదో కానీ అది ఫలితం తేడా కొట్టడంతో అమ్మడికి తెలుగులో పెద్దగా అవకాశాలు రాలేదు. అయితే నేనొక్కడినే తర్వాత బాలీవుడ్ లో హీరో పంటి చేసిన కృతి అక్కడ క్రేజ్ తెచ్చుకుంది. నాగ చైతన్యతో దోచెయ్ అంటూ మరో అటెంప్ట్ చేసినా వర్క్ అవుట్ కాలేదు. సౌత్ కన్నా బాలీవుడ్ బెస్ట్ అనుకున్న కృతి సనన్ అక్కడ మొదట్లో పెద్దగా అవకాశాలు రాబట్టలేకపోయినా తర్వాత తర్వాత అవకాశాలు అందుకుంది.కెరీర్ లో ఒక్కో అడుగు వేసుకుంటూ వచ్చిన కృతి సనన్ బాలీవుడ్ లో ఇప్పుడు వన్ ఆఫ్ ది క్రేజీ హీరోయిన్ గా పేరు తెచ్చుకుంది. రీసెంట్ గా క్రూ తో మంచి మరో సక్సెస్ అందుకున్న కృతి ఆ సినిమాలో కరీనా కపూర్, టబులతో కలిసి సత్తా చాటింది. తెలుగులో రెండు సినిమాలు చేసిన అమ్మడు ఇక్కడ మొదట్లో లక్ కలిసి రాలేదు కాబట్టి ఇప్పుడు మళ్లీ ఇక్కడ ఛాన్స్ వస్తే తన సత్తా చాటుతా అంటుంది. రీసెంట్ ఇంటర్వ్యూలో సౌత్ సినిమాలపై తన అభిమానం తెలిపింది కృతి సనన్. ఇప్పుడు టాలీవుడ్ లో స్టార్ హీరోలు చేస్తున్న ప్రతి సినిమా పాన్ ఇండియా వైడ్ రిలీజ్ అవుతున్న కారణంగా కృతి సనన్ కి మళ్లీ టాలీవుడ్ వైపు గాలి మళ్లింది. అయితే తెలుగులో చేసిన రెండు సినిమాలు బెటర్ రిజల్ట్ ఇవ్వలేదు కాబట్టే కృతికి మళ్లీ తెలుగులో ఛాన్సులు రాలేదని చెప్పొచ్చు. అయితే కృతి సనన్ మాత్రం తెలుగులో అవకాశం వస్తే తప్పకుండా చేస్తానని అంటుంది.డైరెక్ట్ గా తెలుగు సినిమా ఈమధ్యలో చేయలేదు కానీ తెలుగు హీరో ప్రభాస్ తో ఆదిపురుష్ లో నటించింది కృతి సనన్. ఆ సినిమా టైం లో ప్రభాస్ కి ఆమెను లింక్ చేస్తూ చాలా వార్తలు వచ్చాయి. ప్రభాస్ కృతి సనన్ ని పెళ్లాడతాడని హడావిడి చేశారు. కానీ అదంతా మధ్యలో వాళ్ల సృష్టి అని తర్వాత తెలిసింది. కృతి సనన్ ప్రస్తుతం బాలీవుడ్ లో దూ పట్టి సినిమా చేస్తుంది. ఈ సినిమాలో ఆమె నటించడమే కాదు నిర్మాతగా కూడా వ్యవహరిస్తుంది కృతి సనన్.



# హెబ్బా.. ఆ గ్లామర్ డోస్ అస్సలు తగ్గలే..

హెబ్బా పటేల్.. ఈ బ్యూటీకి యూత్ లో సెపరేట్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న విషయం తెలిసిందే. స్టార్ హీరోయిన్ ట్యాగ్ ను దక్కించుకోనప్పటికీ క్రేజ్ మాత్రం సొంతం చేసుకుంది. కుమారి 21 ఎఫ్ మూవీతో కుర్రాళ్ల క్రష్ లిస్ట్ లోకి చేరిపోయింది. అయితే సుమారు పదేళ్ల క్రితం అధ్యక్ష మూవీతో సినీ ఇండస్ట్రీలోకి వచ్చిన హెబ్బా.. అలా ఎలా మూవీతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. కుమారి 21 ఎఫ్ సినిమాలో తన అందం, అభినయంతో ఓ రేంజ్ లో ఆడియన్స్ ను అలరించింది. ఆ సినిమా తర్వాత వరుస ఆఫర్లు అందుకుంది. ఈడో రకం ఆడో రకం, ఎక్కడికి పోతావు చిన్నవాడ, నాన్న నేను నా బాయ్ ఫ్రెండ్స్, అందగాడు, మిస్టర్, 24 కిస్సెస్ తో పాటు అనేక సినిమాల్లో నటించింది. కానీ అనుకున్నంత స్థాయిలో హిట్లు సాధించలేకపోయింది. ఇక ఓదెల రైల్వే స్టేషన్ మూవీలో అదిరిపోయే రోల్ చేసి మంచి హిట్ అందుకుంది. ఇటీవల గీత, శాసనసభ, హనీమూన్ ఎక్స్ ప్రెస్ చిత్రాల్లో నటించింది. ఇప్పుడు వరుస సినిమాల్లో నటిస్తూ బిజీ బిజీగా గడుపుతోంది. అయితే కెరీర్ పరంగా ఎంత బిజీగా ఉన్నా.. సోషల్ మీడియాలో యమా యాక్టివ్ గా ఉంటోంది హెబ్బా పటేల్. ఎప్పటికప్పుడు తన పర్సనల్ తో పాటు సినిమా అప్డేట్స్ ను షేర్ చేసుకుంటూ ఉంటోంది. పిక్స్ తో పాటు డ్యాన్స్ వీడియోలు పోస్ట్ చేస్తూ సందడి చేస్తుంటోంది. అదిరిపోయే ఔట్ ఫిట్స్ లో అందాలు ఆరబోస్తూ అలరిస్తుంటోంది. రకరకాల డ్రెస్సుల్లో సూపర్ పోజులు ఇచ్చి మైమరిపిస్తుంటోంది. పొట్టి బట్టల్లో ఫిదా చేస్తూ ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో ట్రెండింగ్ లోనే ఉంటోంది. తాజాగా కొత్త పిక్స్ షేర్ చేసింది అమ్మడు. సింపుల్ లెహంగా వేసుకుని వయ్యారాలు ఒలకబోసింది. అదిరిపోయిన డ్రెస్ తో హొయలు ఒలికించింది.
రకరకాల పోజులు ఇస్తూ ఫిదా చేసింది. డీసెంట్ గా కనిపిస్తూనే గ్లోయింగ్ స్కిన్ తో మాయ చేసింది. క్రేజీ ఇయర్ రింగ్స్ అమ్మడు అందాన్ని మరింత పెంచాయి. హెబ్బా పోస్ట్ చేసిన పిక్స్.. క్షణాల్లో వైరల్ అయిపోయాయి. లైకులు కొడుతూ ఫోటోలు తెగ షేర్ చేస్తున్నారు నెటిజన్లు, అభిమానులు. లవ్ అండ్ ఫైర్ ఎమోజీలను కామెంట్స్ గా పెడుతున్నారు.



# పుష్ప 2.. నిజంగా గోల్డెన్ ఛాన్స్ మిస్సయ్యింది

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్ప ది రూల్ మూవీ కోసం ఫ్యాన్స్ చాలా కాలంగా వెయిట్ చేస్తున్నారు. సుకుమార్ ఈ సినిమాని అప్పుడు, ఇప్పుడు అంటూ షూటింగ్ పొడిగిస్తూనే ఉన్నారు. మూడేళ్లు అవుతున్న ఇంకా ఫైనల్ స్టేజ్ కి రాలేదు. ఫాహద్ ఫాజిల్ క్యారెక్టర్ కి సంబందించిన సన్నివేశాలు ఇంకా పెండింగ్ లో ఉన్నాయంట. ఇవన్నీ అయ్యాక మరల పుష్పరాజ్ క్యారెక్టర్ పై 15 రోజుల షూటింగ్ ఉండబోతోందంట. ఈ షూటింగ్ ఎప్పటికి పూర్తవుతుందనేది చిత్ర యూనిట్ కి కూడా క్లారిటీ లేదు. సుకుమార్ ఓ వైపు ఎడిటింగ్ వర్క్ చేయిస్తూనే మరో వైపు షూటింగ్ కూడా కొనసాగిస్తున్నారు. పుష్ప సినిమాలో జరిగిన చిన్న చిన్న పొరపాట్లని కూడా సరిచేసుకొని ప్రేక్షకులు ఎక్స్ పెక్ట్ చేయని రేంజ్ లో పుష్ప ది రూల్ చిత్రాన్ని అందించాలని అనుకుంటున్నారు. అందుకే షూటింగ్ కోసం ఎక్కువ టైం తీసుకుంటున్నారు. ఈ చిత్రాన్ని 2022 ఆఖరులో రిలీజ్ చేస్తామని ముందు ప్రకటించారు. అయితే షూటింగ్ ఫినిష్ కాకపోవడంతో 2023 ఆగష్టు 15న రిలీజ్ ఎనౌన్స్ చేశారు. అది కూడా క్యాన్సిల్ అయ్యి డిసెంబర్ 6 అంటూ మరో రిలీజ్ డేట్ ని ప్రకటించారు. ఈ తేదీకైనా మూవీ వస్తుందా అంటే సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొంది. అయితే ఆగష్టు 15 పుష్ప ది రూల్ మూవీ రిలీజ్ చేసి ఉంటే ఇండిపెండెన్స్ డే తో పాటు ఫెస్టివల్స్, వీకెండ్స్ అన్ని హాలిడేస్ తో కనీసం 5 రోజులు కలిసొచ్చేది. అలాగే కృష్ణాష్టమి హాలిడే సెకండ్ వీకెండ్ కూడా కలిసొచ్చే ఛాన్స్ ఉండేది. పుష్ప ది రూల్ మీద ఉన్న ఎక్స్ పెక్టేషన్స్ కి ఆగష్టు 15న రిలీజ్ చేసి ఉంటే వారం, పది రోజుల్లోనే 400-500 కోట్ల మధ్యలో కలెక్షన్స్ అందుకొని ఉండేదనే మాట వినిపిస్తోంది. అలాగే వీకెండ్ నాలుగు రోజులు కూడా భారీ కలెక్షన్స్ ని రాబట్టే ఛాన్స్ ఉండేదని ట్రేడ్ పండితులు అంటున్నారు. ఇలాంటి డేట్ మళ్ళీ పుష్ప ది రూల్ కి దొరక్కపోవచ్చనే మాట వినిపిస్తోంది. పుష్ప ది రూల్ డిసెంబర్ 6కి వాయిదా పడటంతో ఆగష్టు 15కి రామ్ పోతినేని డబుల్ ఇస్మార్ట్, రవితేజ మిస్టర్ బచ్చన్ సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. ఈ సినిమాలకి వీకెండ్ బాగా కలిసొచ్చే ఛాన్స్ ఉంది. అలాగే హిందీలో స్త్రీ2, ఖేల్ ఖేల్ మెయిన్, వేద సినిమాలు ఆగష్టు 15న ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి. వీటిలో ఎన్ని సినిమాలు లాంగ్ వీకెండ్ ని ఉపయోగించుకుంటాయనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.